సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 21 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

138 గ్రామాల అభివృద్ధికి ప్రతిపాదనలు



మాట్లాడుతున్న పీవో అభిషేక్, చిత్రంలో కలెక్టర్ సుమిత్‌కుమార్

చింతపల్లి: ప్రధాన మంత్రి ఆది ఆదర్శ గ్రామ యోజన పథకంలో భాగంగా 138 గ్రామాల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా ప్లానింగ్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో రూ.20.38 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. గ్రామాభివృద్ధికి ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు క్రమం తప్పకుండా స్కానింగ్ పరీక్షలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య



వివరాలు తెలుసుకుంటున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య

కూనవరం: గర్భిణులు ప్రతినెల 9వ తేదీన నిర్వహించే స్కానింగ్ పరీక్షలను క్రమం తప్పకుండా చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య సూచించారు. శుక్రవారం ఆయన కూనవరం (కోతులగుట్ట) కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను డిప్యూటీ డెమో అధికారి రవి కుమార్‌తో కలిసి సందర్శించారు. స్కానింగ్ విభాగాన్ని పరిశీలించారు. ప్రతినెల గర్భిణులకు అందిస్తున్న సేవల వివరాలను ఆయన తెలుసుకున్నారు. స్కానింగ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటూరు, రేఖపల్లి, జీడిగుప్ప, గొరిదే వీపేట, నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని గర్భిణులు స్కానింగ్ పరీక్షల సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. అలాగే 9వ తేదీన జరిగే పీఎంఎస్‌ఎంఏ స్కానింగ్‌తో పాటు ఇతర వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డి, జనరల్ సర్జన్ ఎంవీ మహేష్‌బాబు, హెడ్‌నర్స్‌బొజ్జి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రాజ్‌కుమార్ మృతదేహం

ఎటపాక: మండల కేంద్రం ఎటపాకలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు దుర్మరణం చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం దానవాయిపేట గ్రామానికి చెందిన సవలం రాజ్‌కుమార్ (22)ద్విచక్రవాహనంపై భద్రాచలం వస్తున్నాడు. ఈక్రమంలో వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్ తలకు తీవ్ర గాయం కావడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అతని బంధువుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పార్థసారథి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్రేబులో జ్వరాల విజృంభణ



జ్వరంతో బాధపడుతున్న బాలుడు

అనంతగిరి: మండలంలోని మారుమూల పెదకోట పంచాయతీ మద్రేబు గ్రామంలో జ్వరాలతో గిరిజనులు మంచం పట్టారు. వారం రోజుల క్రితం పినకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో వైద్యశిబిరాలు నిర్వహించడంతో జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. మళ్లీ జ్వరాలు సోకాయి. గ్రామంలో కొర్రా చిలుకమ్మ, ఆశా కార్యకర్త వాంతులు బాధపడుతున్నారు. కె.కొత్తాయి, కె.జిమ్ములు, కె.సుందరి, కె.మార్త, కె.లక్ష్మణ్, కె.మంగి, కె.సునీత, వి.మసి, కె.జంబో, కె.సుందరి జ్వరాల బారిన పడ్డారు. పినకోట వైద్యాధికారులు గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించాలని గిరిజనులు కోరుతున్నారు.

రాజకీయాలకు అతీతంగా సంపూర్ణ అభివృద్ధి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి



హాజరైన ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు

- రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేసిన సీఎంగా జగన్‌కు జనాదరణ
- బాక్సైట్ జీవో 97 రద్దు చరిత్రాత్మకం
- బస్సుయాత్రను విజయవంతం చేయాలి
- చంద్రబాబు పాలనలో దోపిడీ
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



వైఎస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు

సాక్షి, పాడేరు: కులమతాలు,రాజకీయాలకు అతీతంగా ఏపీ ప్రజలకు సంపూర్ణ అభివృద్ధితో మేలు చేసిన గొప్ప ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనాదరణ పొందుతున్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఈనెల 30 నుంచి పాడేరు నియోజకవర్గంలో ప్రారంభం కానున్న వైఎస్సార్‌సీపీ బస్సు యాత్ర సన్నాహక సమావేశాన్ని చింతపల్లిలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా మహానేత వైఎస్ విగ్రహానికి వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు, వైఎస్సార్‌సీపీ వైద్యుల విభాగం జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తమర్బ నరసింగరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్ష నేత హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి చింతపల్లిలో బాక్సైట్ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని గిరిజనులకు అండగా నిలిచారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అన్యాయంగా జారీ చేసిన బాక్సైట్ జీవో 97ను వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రద్దు చేసి గిరిజన సమాజం మేలుకు శాశ్వత పరిష్కారం చూపిన సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచారన్నారు. పాడేరులో రూ.500కోట్లతో వైద్య కళాశాలను నిర్మిస్తున్నారని, చింతపల్లిలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించడం కూడా మంచి పరిణామమన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గిరిజనులకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. గత చంద్రబాబు పాలనలో దోపిడీ తప్ప గిరిజనులకు ఒరిగిందేమి లేదన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో పాల్పడిన అవినీతి,అక్రమాలకు తగిన సాక్ష్యాలు ఉన్నందున న్యాయస్థానాలు జైలుకు రిమాండ్ ఖైదీగా ఆయనను పంపాయన్నారు. చంద్రబాబు జైలుకు వెళ్లడానికి కారణమైన రూ.వందల కోట్ల అవినీతిని గడపగడపకు ప్రచారం చేయాలని సూచించారు. ఈనెల 30వ తేదీ నుంచి పాడేరు నియోజకవర్గంలో జరిగే సామాజిక న్యాయ బస్సు యాత్రను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు జరిగిన మేలును ప్రజలకు తెలియజేయాలని కోరారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున చంద్రబాబు ప్రజల్లోకి వచ్చి మోసం చేసే చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. అలాగే నవంబర్ ఒకటో నుంచి మళ్లీ జగనే ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలనే కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో చేపట్టాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుజేసిన 98శాతం హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. పార్టీ జెండాలను కూడా గ్రామాల్లో ఘనంగా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర వైద్యం అందుతుందన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఎంతో మేలు: పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మేలు చేశారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. అన్ని ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. విద్య, వైద్య వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చారని, కార్పొరేట్ స్థాయిలో పాడేరు, చింతపల్లిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు అందుబాటులోకి వస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలోని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ పాలనలో గిరిజన ప్రాంతానికి జరిగిన మేలును గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో గెలుపే లక్ష్యంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, నవరత్నాల పథకాల రాష్ట్ర ఇన్‌చార్జి మూర్తి, జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్లు జల్లిపల్లి సుభద్ర, శోభా స్వాతిరాణి, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఫరూఖ్, వైఎస్సార్‌సీపీ డాక్టర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అచ్యుత్‌కుమార్, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎస్టీ కమిషన్ సభ్యుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పాడేరు, చింతపల్లి మార్కెట్ కమిటీల చైర్మన్లు కూతంగి సూరిబాబు, రాజులమ్మ, ఎంపీపీలు బడుగు రమేష్, కోరాబు అనూషాదేవి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల పార్టీ అధ్యక్షులు మోరి రవి, సీదరి రాంబాబు, లక్ష్మణ్, మత్స్యకొండబాబు పాల్గొన్నారు.

బస్సుయాత్ర పాడేరు ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి



బస్సుయాత్ర ఇన్‌చార్జి అప్పిరెడ్డిని పరిచయం చేస్తున్న వైవీ సుబ్బారెడ్డి

సామాజిక న్యాయ బస్సుయాత్రకు సంబంధించి పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని నియమించామని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. సన్నాహక సమావేశంలో ఆయనను పార్టీ నాయకులు, కార్యకర్తలకు పరిచయం చేశారు. బస్సు యాత్ర విజయవంతానికి ఆయన పర్యవేక్షణలో పార్టీ నాయకులు, కార్యకర్తలంతా కృషి చేయాలని సుబ్బారెడ్డి కోరారు.

పరీక్ష ఫీజు గడువు పెంపు

సీలేరు: ఇంటర్ ఫెయిలైన విద్యార్థులు పరీక్ష ఫీజును చెల్లించే గడువును పొడిగించినట్లు ఇంటర్ బోర్డు డీవీఈవో కె.అప్పలరాము తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వచ్చే మార్చిలో జరగనున్న పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించే గడువు తేదీని వచ్చేనెల 30 వరకు పొడిగించామన్నారు.

ఓటరు జాబితాల్లో తప్పల సవరణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శుభంబన్సాల్

రంపచోడవరం : రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లోని ఓటరు జాబితాల్లో తప్పులను బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సవరించేలా చర్యలు తీసుకున్నామని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన సబ్ కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు సవరణ ప్రక్రియపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పోలింగ్ బూత్ స్థాయిలో 99 శాతం మేర ఇంటింటా సర్వే పూర్తయిందన్నారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,72,004 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఓటు నమోదుకు 376 దరఖాస్తులు, చనిపోయిన వారి పేర్లు తొలగింపునకు 1047 దరఖాస్తులు, జాబితాలో పేర్లు, ఫొటో సరిచేసేందుకు 1147 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముందు రోజు వరకు ఓటర్ల జాబితాలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత ఫారంల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరంగా ఏమైనా సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలని సూచించారు. వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి తగు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్‌వీవీ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఇందిరాబాయి పాల్గొన్నారు.

జర్నలిస్టుల శిక్షణ తరగతులకు విశేష స్పందన



కొమ్మినేని శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఆర్వో గోవిందరాజులు



కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సీఆర్ మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

సాక్షి, పాడేరు : రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ శిక్షణ తరగతులకు విశేష స్పందన వచ్చిందని సీఆర్ మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అరకు పర్యటన అనంతరం శుక్రవారం పాడేరు చేరుకున్న ఆయనను పీఎంఆర్సీ అతిథిగృహంలో డీపీఆర్వో పి.గోవిందరాజులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ జర్నలిస్టులకు అకాడమి తరఫున శిక్షణ అందిస్తున్నామన్నారు. జర్నలిస్టులకు వారి సొంత జిల్లాల్లో ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి శనివారం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను రప్పించి సంబంధిత అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతోందని, జర్నలిస్టులు, జర్నలిజంపై ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం కింద జర్నలిస్టులు రూ.1250 చెల్లిస్తే సమాచార పౌర సంబంధాల శాఖ ప్రభుత్వం తరఫున మరో రూ.1250 చెల్లిస్తుందన్నారు. ఈ కార్డుల ద్వారా అన్ని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. అంతేకాక నిబంధనల మేరకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయించుకోవచ్చని ఆయన కోరారు.

మత్స్యగుండం సందర్శన

హుకుంపేట: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండం మత్స్యలింగేశ్వర స్వామి వారిని శుక్రవారం ఏపీ ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ప్రాంతాన్ని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఆలయ చరిత్ర, మత్స్యగుండం విశిష్టతను ఆలయ కమిటీ సభ్యుల నుంచి తెలుసుకున్నారు. కొమ్మినేని దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టి.అప్పారావు, సూర్యనారాయణ, పి.మత్స్యకొండబాబు, సింహాచలం, గోపాలపాత్రుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి



విద్యార్థిని సుస్మిత మృతదేహం

అరకులోయ రూరల్: మండలంలోని బిస్కి గ్రా మంలో విద్యార్థిని సమర్డి సుస్మిత శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె కొత్తభల్లుగుడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. కొంతకాలంగా గొంతునొప్పితో బాధపడుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె ఆరోగ్యం విషమించడంతో మృతి చెందినట్టు తండ్రి సమర్డి మొస్య, కుటుంబ సభ్యులు తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

వై.రామవరం: గ్రామ సచివాలయాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకుంటే చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే సిబ్బందిని హెచ్చరించారు. మండల ఎగువప్రాంతంలో శుక్రవారం అయన ఆకస్మికంగా పర్యటించారు. దీనిలో భాగంగా గుర్తేడు సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు సక్రమంగా లేకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గుర్తేడు పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులు, మందుల నిల్వలు, సిబ్బంది వివరాలను పరిశీలించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధానంపై సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం పూలోవ, వట్టిగడ్డ గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. మండల ఎగువ ప్రాంతానికి మంజూరైన ఉపాధిహామీ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. తాగునీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నాయా లేదా అనే అంశంపై స్థానికులతో మాట్లాడారు. తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, సర్పంచ్ దుష్యంతుడు, ఏఈఈలు ఎంవీవీ సత్యనారాయణ, శివరాం, చందు, ఎంఈవో కె.తాతబ్బాయిదొర, ఏపీవో స్వామి పాల్గొన్నారు.

డౌనూరుకు దేశవ్యాప్తంగా గుర్తింపు

- ఇక్కడ ఏర్పాటు కానున్న క్యూరింగ్ సెంటర్ నుంచి కాఫీ ఉత్పత్తులు సరఫరా
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి రాజన్నదొర



కాఫీ క్యూరింగ్ కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన రాజన్నదొర,పక్కన ఎంపీ, ఎమ్మెల్యేలు

కొయ్యూరు: భవిష్యత్తులో డౌనూరు పేరు దేశవ్యాప్తంగా వినిపించనుందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. శుక్రవారం డౌనూరులో రూ.4కోట్లతో సమీకృత కాఫీ క్యూరింగ్,రోస్టింగ్, పౌడర్ తయారీ యూనిట్‌కు వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డితో కలిసి శంకుస్థాపన చేసిన సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడారు. ఇంత వరకు జీసీసీ కొనుగోలు చేసిన కాఫీ పిక్కలను బెంగళూరు తీసుకెళ్లి క్యూరింగ్ చేసి ప్యాకెట్లు తయారు చేయాల్సి వచ్చేదన్నారు. రవాణాకు ఎక్కువగా ఖర్చు అయ్యేదన్నారు. ఇకపై ఇక్కడి నుంచే సరఫరా అవుతుందన్నారు. డౌనూరులో క్యూరింగ్ సెంటర్ ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. గిరిజన మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూత, ఆసరా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కాఫీని భారీగా కొనుగోలు చేస్తే నిల్వ చేసేందుకు అవసరమైన గోదామును నిర్మిస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైవీ సుబ్బారెడ్డి విచ్చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందుగానే క్యూరింగ్ కేంద్ర నిర్మాణం పూర్తిచేస్తామని గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారన్నారు. ప్రస్తుతం కాఫీ పాచిమెంట్ కిలో రూ.270, చెర్రీ రూ.145,రొబస్టా రూ.75కు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. కొయ్యూరు మండలంలో జీడితోటలు అధిక విస్తీర్ణంలో ఉన్నందున వాటి ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ కాఫీ గిరిజనుల ఆదాయాన్ని పెంచుతుందన్నారు. సాగును విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీనిలో భాగంగానే ఈఏడాది 16 వేల ఎకరాల్లో తోటలు వేశామన్నారు. ఎంపీ మాధవి మాట్లాడుతూ డౌనూరులో కాఫీ క్యూరింగ్ అనుకూలమైన వేడి వాతావరణం ఉందన్నారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, సర్పంచ్ పాట్టిక భవాని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- చింతపల్లిలో జగనన్నకు చెబుదాం నిర్వహణ
- ప్రజల నుంచి 273 అర్జీల స్వీకరణ



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, పీవో అభిషేక్



మృతుని కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పీవో అభిషేక్

చింతపల్లి: జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందనలో స్వీకరించిన వినతులకు సంబంధించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజల నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ 273 వినతులు స్వీకరించారు. వీటిని సత్వరం పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారులు, వీఎస్ ప్రభాకర్ , వెంకటేశ్వరరావు, డీడీ కొండలరావు, పీఆర్ ఈఈ కొండయ్య పడాల్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బీఎస్ నంద్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పీఎస్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ మురళి, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చాపాత్రుడు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- అన్నవరం పంచాయతీ కూర్మన్నపాకలుకు గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన బలరామ్, మత్స్యరాజు వినతిపత్రం అందజేశారు.
- ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు మంజూరు చేయాలని తాజంగి పంచాయతీ బాసింగి కొత్తూరుకు చెందిన లింగమూర్తి అధికారులను కోరాడు.
- సీసీ రోడ్డు, అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించాలని చౌడుపల్లి పంచాయతీ వి.కొత్తూరుకు చెందిన సాగిన గంగన్నపడాల్ కోరారు.
- గ్రామంలో తాగునీటి పథకం మంజూరుచేయాలని, సీసీ రోడ్డు రోడ్డు నిర్మించాలని కొత్తపాలెం పంచాయతీ పెదపాకలుకు చెందిన రమేష్, భీమరాజు కోరారు.
- గ్రామంలో సీసీ రోడ్లు నిర్మించాలని, తాగునీటి పథకం ఏర్పాటుచేయాలని గూడెంకొత్తవీధి మండలం ఏబులంకు చెందిన కంకిపాటి సత్తిబాబు కోరారు.

బాధిత కుటుబానికి చెక్కు అందజేత: పాడేరు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొండబాబు కుటుంబ సభ్యులకు మండల కేంద్రంలో జరిగిన స్పందన కార్యక్రమంలో రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పీవో అభిషేక్ అందజేశారు. ఈ ఏడాది ఆగస్టు 20న పాడేరు ఘాట్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో బరిసింగి పంచాయతీ కొత్తూరుకు చెందిన కొండబాబు ద్విచక్రవాహన ప్రమాదంలో గాయపడి మృతి చెందాడు. అతని కుటుంబానికి ఐటీడీఏ పీవో రూ.10 లక్షల ఆర్థిక సాయం మంజూరుచేశారు. చెక్కును మృతుడి కుమారుడు విశ్వేశ్వరరావుకు అందజేశారు. కోరుకొండకు చెందిన కొర్రా నూకాలమ్మ అనే వికలాంగురాలికి చక్రాల కుర్చీని అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ స్వాతిరాణి, ఎంపీపీ అనూషాదేవి, ఎంపీడీవో ఆశాజ్యోతి, సర్పంచ్ దురియా పుష్పలత పాల్గొన్నారు.

సానుకూలంగా స్పందన



స్పందన కార్యక్రమంలో తాను ఇచ్చిన వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించారు. గ్రామంలో తాగు నీరు, సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

– కంకిపాటి సత్తిబాబు, ఏబులం, జీకేవీధి మండలం

అవస్థలు తప్పాయి



గతంలో స్పందనలో వినతులు ఇచ్చేందుకు జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్ల వలసి వచ్చేది. ఇప్పుడు మండల కేంద్రంలో ఏర్పాటు చేయడం వల్ల అవస్థలు తప్పాయి.ఆర్వోఎఫ్ ఆర్ పట్టాల మంజూరుకు వినతిపత్రం ఇచ్చాను. అధికారులు స్పందించి చర్యలు చేపడతామన్నారు.

– లింగమూర్తి, బాసింగి కొత్తూరు. చింతపల్లి మండలం

జగనన్న ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం



సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

చింతపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వల్ల పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. మండల కేంద్రంలోని అంతర్లలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు 280 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ కార్యక్రమం వల్ల గిరిజనుల ముంగిటకే ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో రమణి, వైద్యాధికారులు లక్ష్మీకాంత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరికి విద్యుత్ బస్సులు

- ట్రయల్ రన్ నిర్వహించిన ఒలెక్ట్రా సంస్థ
- ప్రస్తుతం రెండు బస్సులు నడుపుతున్న దేవస్థానం
- వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే యోచన
- తిరుమల కొండపైకి మాదిరిగా నడిపే ప్రయత్నం
- విజయవంతమైతే భవిష్యత్తులో ఆర్టీసీ కూడా అదే బాట



ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఎలక్ట్రిక్ బస్సు

సాక్షి, విశాఖపట్నం/సింహాచలం: సింహగిరికి విద్యుత్ బస్సులు నడపడంపై కసరత్తు జరుగుతోంది. తిరుపతి-తిరుమల మధ్య ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్న సంగతి తెలిసిందే. ఇదే తరహాలో అప్పన్న కొండపైకి కూడా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలని సింహాచలం దేవస్థానం తలపోస్తోంది. ప్రస్తుతం ఈ దేవస్థానం కొండ దిగువ నుంచి కొండపైకి రెండు బస్సులను నడుపుతోంది. వీటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తిప్పాలన్న ప్రతిపాదనకు దేవదాయశాఖ కమిషనర్ నుంచి ఆమోదం లభించింది. ఇందులో భాగంగా విద్యుత్ బస్సుల తయారీ సంస్థ ఒలెక్ట్రా హైదరాబాద్ నుంచి ఒక బస్సును సింహాచలానికి పంపింది. ఈ బస్సుతో గురు, శుక్రవారాల్లో దేవస్థానం అధికారులు, పాలకమండలి సభ్యులు, ఆర్టీసీ అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. 12 మీటర్ల పొడవు, 41 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ బస్సులో వీరు ప్రయాణించారు. ఇప్పటికే ఆర్టీసీ కూడా కొండపైకి 11.2 మీటర్ల పొడవున్న బస్సులను నడుపుతోంది. ఆర్టీసీ నడుపుతున్న ఈ సైజ్ బస్సులకు సింహగిరి ఘాట్ రోడ్డుపై ఎలాంటి ఇబ్బంది తలెత్తడం లేదు. ప్రతిపాదిత విద్యుత్ బస్సు.. ఆర్టీసీ బస్సు సైజుకంటే 0.8 మీటర్లు ఎక్కువ పొడవుంది. దీంతో ఈ ఘాట్ రోడ్డుపై ఉన్న మలుపులు తిరగడానికి ఏమైనా సమస్యలు ఎదురవుతాయా? చార్జింగ్ వంటి అంశాలను పరిశీలించారు. అయితే ఈ ట్రయల్ రన్‌లో అలాంటి ఇబ్బందులేర్పడ లేదు.

ఏసీ సర్వీసుపై సందిగ్ధత..

ప్రస్తుతం తిరుపతి-తిరుమల మధ్య నడుస్తున్న ఎలక్ట్రిక్ బస్సులకు ఏసీ సదుపాయం ఉంది. ప్రతిపాదిత సింహాచలం కొండపైకి నడపనున్న ఈ-బస్సులకూ ఏసీ సౌకర్యం ఉండనుంది. దాదాపు గంటకు పైగా ప్రయాణం ఉండడంతో తిరుమల విద్యుత్ బస్సులకు ఆదరణ ఉంటోంది. కానీ సింహాచలం కొండ దిగువ నుంచి కొండపైకి కేవలం 4 కి.మీల దూరం ఉంది. ఈ స్వల్ప దూరానికే విద్యుత్ ఏసీ బస్సులకు డిమాండ్ ఉంటుందా? అన్న దానిపై చర్చించారు. నాన్ ఏసీ విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టడమే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దృష్టి సారించిన ఆర్టీసీ..

మరోవైపు ఆర్టీసీ రాష్ట్రంలో వెయ్యి విద్యుత్ బస్సులను కొనుగోలు చేస్తోంది. వీటిలో విశాఖకు తొలిదశలో 100, రెండో దశలో 100 బస్సులు చొప్పున కేటాయించే అవకాశం ఉంది. మరికొన్ని నెలల్లోనే తొలివిడత విద్యుత్ బస్సులు విశాఖ రానున్నాయి. ఈ-బస్సులు వస్తే కొన్నింటిని సింహాచలం కొండపైకి కూడా నడపాలని యోచిస్తున్నామని, అందుకే ఈ ట్రయల్ రన్‌లో తాము కూడా పాల్గొన్నామని ఆర్టీసీ డీపీటీవో ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

ట్రయల్ రన్ ఇలా..

సింహగిరి ఘాట్‌రోడ్డులో ఎలక్ట్రిక్ బస్సు ట్రయల్ రన్‌లో దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అశోక్‌గజపతిరాజు, ఈవో శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ఒక్కో విద్యుత్ బస్సు కొనుగోలుకు రూ.1.60 కోట్లు వెచ్చిస్తున్నందున ఘాట్‌రోడ్డులో బస్సులు ఏమేర సామర్థ్యాన్ని కలిగి ఉంటాయో పరిశీలించారు. వీరితోపాటు ట్రస్ట్‌బోర్డు సభ్యులు శ్రీనివాసరావు, దినేష్‌రాజ్, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, దొడ్డి రమణ, శ్రీనుబాబు, సతీష్, శ్రీదేవి, రాజేశ్వరి, శ్రీదేవి వర్మ, రామలక్ష్మి, రాధ, పద్మ, ప్రత్యేక ఆహ్వానితులు చందు యాదవ్, శేషారత్నం, ఆర్టీసీ డీపీటీవో అప్పలరాజు, డీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా ఆయుధపూజ



స్వామివారి ఆయుధాలు

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న విజయదశమి మహోత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయుధ పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో సింహవల్లీతాయారు సన్నిధిలో పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఆయుధాలైన గద, ధనస్సు, బాణం, కత్తి, పరశురామ గొడ్డలి, ఖైజార్ తదితర ఆయుధాలను ఉంచారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, ఆయుధ దేవాత ఆవాహనం, ఆరాధన నిర్వహించారు. ఆయుధాలకు విశేషంగా హారతులిచ్చారు. అనంతరం పూజలో ఉంచిన ఆయుధాలను సింహవల్లీ తాయారుకి అలంకరించారు. ఆలయ స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ తదితరులు పూజను నిర్వహించారు. ఈనెల 24వ తేదీ విజయదశమి వరకు సింహవల్లీ తాయారు సన్నిధిలోనే ఆయుధాలను ఉంచుతారు. రోజూ విశేషంగా ఆరాధన నిర్వహిస్తారు.

పర్యాటక రంగం అభివృద్ధితో మంచి ఆదాయం

ఏపీ ప్రభుత్వ మీడియా, అంతర్రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్



గిరిజన థింసా కళాకారులతో అమర్ దంపతులు

అరకులోయ టౌన్: రాష్ట్రంలో ప్రకృతి సిద్ధమైన సహజ వనరులు పుష్కలంగా ఉన్నందున పర్యాటక రంగాన్ని సరైన రీతిలో ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా మంచి ఆదాయం లభిస్తుందని ఏపీ ప్రభుత్వ మీడియా, అంతర్రాష్ట్ర వ్యవహారాల సలహాదారు దేవులపల్లి అమర్ అన్నారు. పర్యాటక కేంద్రమైన అరకులోయలో శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక రంగంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పర్యాటకులకు రవాణా, వసతి తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పిస్తే మరింత ఆదాయం పెరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యం కల్పించి అభివృద్ధి చేస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటోందన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తయితే విశాఖపట్నం పరిసర ప్రాంతాల అభివృద్ధికి అవకాశాలతోపాటు విదేశీ పర్యాటకులు పెరుగుతారన్నారు. అరకు అందాలు, గిరిజన సంస్కృతి సంప్రదాయాలు ఎంతగానో ఆకట్టుకున్నాయని వివరించారు. డీపీఆర్వో గోవిందరాజులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అమర్ కుటుంబ సభ్యులతో గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియంను సందర్శించారు. మత్రి కామయ్య సాంస్కృతిక కళావేదికపై థింసా నృత్యాన్ని తిలకించారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీ వైఎస్ జగనే సీఎం కావాలి

ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు



ఎల్లవరంలో పార్టీ ముఖ్య నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అడ్డతీగల: రాష్ట్ర భవిష్యత్తు కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే మళ్లీ సీఎం కావాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. ఎల్లవరంలో రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహించనున్న నేపథ్యంలో నేతలను సమాయత్త పరిచారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం, గిరిజన బిడ్డల భవిష్యత్తు కోసం, ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలన్నీ భవిష్యత్తులో కొనసాగాలి అంటే ఆంధ్రప్రదేశ్‌కి జగనేకావాలని తెలిపారు.ఈవిషయాలతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నియోజకవర్గం వ్యాప్తంగా పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని చెప్పారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో సమావేశాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో 11 మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ మండల కన్వీనర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభాలు



విద్యుత్ స్తంభాలు నేలకూలి చెలరేగిన మంటలు

వై.రామవరం: మండలంలోని రేగడిపాలెం, కె.యర్రగొండ గ్రామాల మధ్య విద్యుత్ స్తంభం నేలకూలగా త్రుటిలో ఘోర ప్రమాదం తప్పింది. వివరలివి. శుక్రవారం మధ్యాహ్నం కురిసిన గాలివానకు ఒక పెద్ద చెట్టు పడిపోగా, రెండు విద్యుత్ స్తంభాలు రోడ్డుకు అడ్డంగా నేలకూలాయి. విద్యుత్ తీగలు కలసిపోయి పెద్ద మంటలు చెలరేగి, పచ్చని తుప్పలు కూడా కాలిపోయాయి. అదే మార్గంలో అడ్డతీగలకు చెందిన కొంత మంది వ్యక్తులు ద్విచక్రవాహనాలపై ఆ మార్గంలో వెళుతూ మంటలు చూసి, వాహనాలు నిలిపివేవారు. వారు వెంటనే విద్యుత్ శాఖాధికారులకు ఫోన్‌ద్వారా విషయం తెలియజేయగా, వారు స్పందించి, సకాలంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే విద్యుత్ సరఫరా నిలిచిపోయి మండలం అంధకారంలో మగ్గింది.

క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం



వై.రామవరంలో క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించిన ప్రజా ప్రతి నిధులు

వై.రామవరం: అనంత చక్రరావు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటును వై.రామవరంలో శుక్రవారం గ్రామ యువత ఆధ్వర్యంలో ప్రారంభించారు. టోర్నమెంటు కమిటీ సభ్యులు గొర్లె నరేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకట లక్ష్మి, వైస్ ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీర మళ్ల సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, స్థానిక ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని టోర్నమెంటును ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీపీతోపాటు పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ్ భాస్కర్(అనంతబాబు) తండ్రి అయిన అనంత చక్రరావు జ్ఞాపకార్థం ఈ టోర్నమెంటు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ సీఐ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ నేతలు మంచినీళ్ళ నారాయణరావు, కరణం కనకరాజు, మద్దికొండ భారతి బాబు, వెలిదిండి శివ తదితరులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు 20 టీములు రిజిస్ట్రేషన్ చేసుకోగా, శుక్రవారం మూడు మ్యాచ్‌లు నిర్వహించారు. వారం రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

డోలీలో తరలించినా దక్కని ప్రాణం

అనారోగ్యంతో బాలుడి మృతి



కుంబర్ల గ్రామం నుంచి కృష్ణను డోలీలో మోసుకొని తీసుకువెళ్తున్న కుటుంబసభ్యులు, (ఇన్‌సెట్) కృష్ణ మృతదేహం

పెదబయలు: నిండు ప్రాణాన్ని కాపాడేందుకు కుటుంబసభ్యులు కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. వివరాలిలావున్నాయి. మండలంలోని బొంగరం పంచాయతీ కుంబుర్ల గ్రామానికి చెందిన అరడ కృష్ణ (12) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు, వారం రోజుల నుంచి జ్వరం, పచ్చకామెర్లతో బాధపడుతున్నాడు. గ్రామంలో మందులు వాడుతున్నా తగ్గుముఖం పట్టలేదని కుటుంబసభ్యులు తెలిపారు. ఈనేపథ్యంలో ఈ నెల 19వతేదీ ఉదయం నుంచి జ్వరం ఎక్కువైంది. దీంతో కుంబుర్ల గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని చిత్రకాయపుట్టు తరలించారు. అక్కడ నుంచి 108 అంబులెన్సులో గోమంగి పీహెచ్‌సీకి మధ్యాహ్నం 2 గంటలకు తీసుకువెళ్లారు. వెంటనే పరీక్షించిన వైద్య సిబ్బంది కృష్ణ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు దేవుడమ్మ, నాయుడు గుండెలవిసేలా రోదించారు. అక్కడ నుంచి ప్రైవేట్ వాహనంలో మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువెళ్లామని వారు పేర్కొన్నారు. కుంబుర్ల గ్రామానికి రోడ్డు సదుపాయం లేకపోవడం వల్ల డోలీలో తీసుకుని రావడానికి జాప్యం జరిగిందని, ఈ కారణంగా సకాలంలో ఆస్పత్రికి తరలించలేకపోయామని వారు పేర్కొన్నారు.

20 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

హుకుంపేట: ఆంధ్ర, ఒడిశా సరి హద్దు గ్రామాలైన సూడుబు, ఓంద్రుగెడ్డ గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై పాడేరు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.వి.జి. రాజు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 20 వేల లీటర్ల పులుపు, బెల్లం దిమ్మలు, అమోనియాను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.వి.జి. రాజు మాట్లాడుతూ సారా నిర్మూలనకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సారా విక్రయాలు,రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.